ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 07.05.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆపరేషన్ సిందూర్ విజయవంతమై ఏడాది పూర్తయిన సందర్భంగా సైనికుల పరాక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. వారిపై గౌరవార్థం సామాజిక మాధ్యమాల్లో డీపీలు మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
2. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటాల రాజేందర్‌తో కలిసి తార్నాకలో సైన్స్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ పనులను ఈ రోజు పరిశీలించారు.
3. హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించారు.
4. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభ సందర్భంగా ఈ సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సభ స్థలిని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.
5. తెలంగాణలో రాబోయే మూడు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------------------

**ప్రధానమంత్రి - ఆపరేషస్ సిందూర్**

ఆపరేషన్ సిందూర్' ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సాయుధ దళాల శౌర్యపరాక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. భారత్పై దాడి చేసిన వారికి సైన్యం దీటుగా సమాధానం ఇచ్చిందని, వారి విజయం పట్ల ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడని పేర్కొన్నారు. సైనికుల పట్ల గౌరవ సూచకంగా సామాజిక మాధ్యమాల్లో తమ డిస్‌ప్లే పిక్చర్లను

మార్చుకోవాలని మోదీ దేశప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

**డెస్క్**

----------------------------------

**కిషన్ రెడ్డి**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటాల రాజేందర్‌తో కలిసి తార్నాకలోని సీఎస్ఐఆర్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న సైన్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్ పనులను ఇవాళ పరిశీలించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కేంద్రాన్ని మంజూరు చేశారని, ఇది విద్యార్థులు, పరిశోధకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మూడు నెలల క్రితమే ప్రారంభమైన ఈ పనులను వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి పూర్తి చేస్తామన్నారు. అలాగే, ఈ నెల 10న ప్రధానమంత్రి పర్యటనలో భాగంగా జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని, భవిష్యత్తులో రైల్వే, విద్యా రంగాల్లో మరిన్ని ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయని వివరించారు.

**డెస్క్**

--------------------------------

**మెగా రైతు మేళా**

హనుమకొండలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ పాల్గొని వివిధ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా సాగులో ఆధునిక పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. యాంత్రీకరణ ప్రాధాన్యతను వివరిస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు.

**పీటీసీ - వరంగల్**

----------------------------

**కేటీఆర్ - సీఎం**

హన్మకొండలో నిర్వహించిన 'రైతు సంగ్రామ సదస్సు'లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారక రామారావు చేసిన అనుచిత వ్యాఖ్యలపై వరంగల్‌లో కేసు నమోదైంది. అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై దుర్దేశంతో, బాధ్యత రాహిత్యంగా మాట్లాడుతున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, తదితరులు వరంగల్‌లోని సుబేదారి పోలీసులకు కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు.

డెస్క్

----------------------------

**జొన్నలు, మొక్కజొన్నలను పంపిణీ**

రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు పేదలకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో రేషన్ షాపుల ద్వారా జొన్నలు, మొక్కజొన్నలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేయకుండా, మధ్యవర్తుల దోపిడీకి చెక్ పెడుతూ నేరుగా సామాన్యులకు తక్కువ ధరకే అందించనున్నారు. ఈ నిర్ణయం వల్ల గురుకులాలు, హాస్టల్ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందడమే కాకుండా, పౌల్ట్రీ రంగానికి కూడా ఊతం లభిస్తుంది. రైతుల ప్రయోజనాలను కాపాడుతూనే, పేద ప్రజల ఆకలి తీర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ వినూత్న దిశానిర్దేశం చేసింది.

డెస్క్

--------------------------

**అడ్లూరి లక్ష్మణ్**

సంక్షేమ శాఖ పరిధిలోని ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా, వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నిన్న సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలున్న

వారు, స్పౌస్ కేసులు, సుదీర్ఘకాలం మారుమూల ప్రాంతాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. బదిలీల ప్రక్రియలో డిజిటల్ పద్ధతులు పాటించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గురుకులాల్లో బోధన నాణ్యత దెబ్బతినకుండా సిబ్బంది సమతుల్యత పాటించాలని, ముఖ్యంగా మహిళా, దివ్యాంగ ఉద్యోగుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**డెస్క్**

-----------------------------------

**మహిళా శక్తి చీరల పంపిణీ**

రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీకై వస్త్రోత్పత్తిదారులకు ఆర్డర్లు ఇస్తున్నట్లు కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. సిరిసిల్లలో కొత్త డిజైన్లను ప్రదర్శించిన ఆమె, వస్త్ర పరిశ్రమకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే 352 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేశామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

**బైట్ - ఆది శ్రీనివాస్**

ఈ కార్యక్రమంలో కలెక్టర్ గరీమ అగర్వాల్ కూడా పాల్గొన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**హరీష్ రావు**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకంలో జరుగుతున్న జాప్యం, తరుగు పేరుతో సాగుతున్న మోసాలపై ఆయన వివరాలు సేకరించారు. అకాల వర్షాలకు కల్లాల్లోనే తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు.

డెస్క్

----------------------------

**మోదీ పర్యటన**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఈ నెల 10న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ స్మార్ట్ సిటీ, వరంగల్ పీఎం మిత్ర పార్క్ వంటి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఈ నేపథ్యంలో బీజేపీ శ్రేణులు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాట్లలో నిమగ్నమైయ్యాయి. 50 నియోజకవర్గాల నుంచి దాదాపు 2 లక్షల మందిని సమీకరించేలా లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు వెల్లడించారు. జనసమీకరణ కోసం నాలుగు ప్రత్యేక రైళ్లు, 3వేల బస్సులను పార్టీ సిద్ధం చేసింది. సభా ఏర్పాట్లపై రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి  ఇప్పటికే సమీక్షించగా, ఇవాళ సాయంత్రం 5 గంటలకు కిషన్ రెడ్డి స్వయంగా పరేడ్ గ్రౌండ్స్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

డెస్క్

------------------------------

**వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం బుధవారంతో ముగియడంతో నేటి నుండి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చింది. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన చివరి కౌన్సిల్ సమావేశంలో 76.56 కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో పాటు 20 కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. ఎంపీ కావ్య, స్థానిక ఎమ్మెల్యేలు హాజరైన ఈ భేటీలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

**పీటీసీ - వరంగల్**

---------------------------

**మంత్రి సీతక్క**

జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన మహిళా స్వయం సహాయక బృందాల వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె, 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ 26వేల 621 కోట్ల రూపాయల రుణ లక్ష్యంతో కూడిన ప్రణాళికను విడుదల చేశారు.

**డెస్క్**

---------------------------

**ఉపాధి హామి - ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లా కేస్లాగూడలో ఉపాధి హామీ పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులను విధుల నుండి తొలగిస్తూ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు ఉత్తర్వులు జారీ చేశారు. కూలీలు రాకున్నా హాజరు వేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణలో నిజమని తేలడంతో మండల అదనపు ప్రోగ్రాం అధికారి మల్లయ్యతో పాటు ఇద్దరు సాంకేతిక సహాయకులపై ఈ చర్యలు తీసుకున్నారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

----------------------------------

**యూపీఎస్సీ ఉచిత కోచింగ్**

మైనార్టీ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి కోరారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------------

**వాతావరణం**

తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో వీచే ఈదురు గాలులతో పాటు వడగళ్ల

వాన పడే సూచనలు ఉన్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉంది.

**డెస్క్**

---------------------------------------

**చేనేత జౌళి శాఖ - సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చేనేత, మరమగ్గాల సహకార సంఘాలకు సంబందించిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంఘాల ప్రాథమిక ఓటర్ల జాబితాను విడుదల చేశామని చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్ తెలిపారు. జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా సంబంధిత ఆధారపత్రాలతో గడువులోగా సిరిసిల్ల చేనేత జౌళిశాఖ కార్యాలయంలో సభ్యత్వ ధ్రువీకరణ ప్రతం, గుర్తింపు కార్డు ఇతర సంబంధిత ఆధారాలతో ఇవ్వాలని కోరారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**వరి ధాన్యం సేకరణ**

వరి ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, పంటను మిల్లులకు తరలించేందుకు తగినన్ని వాహనాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి జిల్లా అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లైస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ వంటి సరైన ధ్రువపత్రాలు ఉన్న వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

**డెస్క్**

-----------------------------------

**ప్రణాళికా సంఘం**

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూనె గింజలు, పప్పు దినుసుల సాగుతో రైతులు సుస్థిర వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్

చిన్నారెడ్డి సూచించారు. వనపర్తిలో జరిగిన పంటల మార్పిడి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన పాల్గొన్నారు.

**డెస్క్**

------------------------------